
# ముగింపు



## ఇచ్ఛాపురపు రామచంద్రం

ఆ వూరు పెద్దవూరేమీ కాదు.

అక్కడున్నది ఒకే ఒక్క మంచి హోటలు. నిజానికదొక్కటే చాలు. ఏవేళప్పుడు ఏంకావాలన్నా దొరికితీరుతుందా హోటల్లో. రేట్లు కొంచం ఎక్కువయినా ఫలహారాలు రుచిగానూ శుచిగానూ ఉంటాయి. ఆకలిగా ఉన్నవాడు ఆ హోటలుకే వచ్చితీరాలి.

మునిస్వామీ అప్పలరాజూ హోటలు ముందు బండాపి హోటల్లోకి వచ్చారు. హాలులో ఒక్కచోటమాత్రం రెండు కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. పక్క కుర్చీలో ఎవరో ఆఫీసరులాటి మనిషి కూర్చునిఉండడంచూసి కొంచెం సందేహించినా గత్యంతరంలేక పక్కకుర్చీని ఆక్రమించాడు మునిస్వామి.

సర్వర్ వచ్చాడు.

"రెండిడ్లీ..పూరీ...మసాలాదోశె...మినపట్టు..."అన్నాడు మునిస్వామి. అప్పలరాజు-"దోసె" అని మునిస్వామి వేపు చూసి నవ్వాడు.

"చాలా?"

"నిజంగా చాలవు. ఓ పక్క నిండుతుందేమో. అయినా డబ్బులసంగతీ ఆలోచించాలికద? బండితోలిననాడే కడుపు నిండదు! పాడుద్యోగం."

"నీకు మంచి ఉద్యోగం కావాలా?" పక్కనున్న ఆఫీసరులాటి అతనడిగేసరికి హాస్యమేమో అనుకున్నాడు మునిస్వామి.

"ఇడ్లీ ... పెసరట్టు ...చపాతీ... దోసె...స్వీటు...రకానికారేసిచొప్పున

విడివిడిగా పార్సెల్ చెయ్. ఈ ఫ్లాస్కులో పట్టేంత కాఫీ పొయ్.'' అని సర్వర్‌కి చెప్పేసి-అతను మునిస్వామిని మళ్ళీ అడిగాడు.

"నీకు కావలసినంత తిండిపెట్టే ఉద్యోగం. జీతం మాత్రం తక్కువే. మా ఆఫీసరుగారిదగ్గర బాయ్ కమ్ జీప్ డ్రయివరు పోస్టు. ఇష్టమైతే నాతో రా, యిప్పుడే."

మునిస్వామి కళ్ళు మెరిశాయి.

కావలసినంత తిండిదొరికే ఉద్యోగం! ఇంకేం కావాలి? వెధవ జీతం—ఎన్ని రూపాయలయితే ఏం? రూపాయినోట్లు తినంకదా? కక్కుర్తి పడదామన్నా రూపాయి కాగితాలు యిడ్లీల్లా రుచిగానూ ఉండవు, కడుపూ నింపవు.

"వస్తాను సార్. జీపు డ్రయివింగ్ నాకు వచ్చును."

"డ్రయివింగ్ సంగతి సరే. మా అయ్యగారి ఇంటర్వ్యూ మరోలా ఉంటుంది. బహుశా నువ్వు తట్టుకోగలవేమోలే. నీ అదృష్టాన్ని పరీక్షించుకో. నీకు దంతసిరి ఉంటే ఉద్యోగం దొరుకుతుంది."

మునిస్వామి ఆయనవెంట నడిచాడు.

తోవలో చెప్పాడాయన- "ఈ టిఫిన్ల గోతాం ఉంది చూశావ్, యిది మా అయ్యగారికి బ్రేక్‌ఫాస్టన్నమాట. ఇవన్నీ తినేసి ఆ ఫ్లాస్కు ఖాళీచేస్తే రెండు మూడు గంటలవరకూ వారి కాకలి వెయ్యదు."

''ఒక్కొక్కరుంటారండి అలా తినగలిగే అదృష్టవంతులు. ఆయన పూర్వ కాలంమనిషే మోనండి. దేనికయినా పెట్టిపుట్టాలి. ఈ కాలపువాళ్ళ తిండేం తిండండి? పిట్టతిండి."

పనికొస్తావనుకున్నాడు ఆఫీసరు

ఆఫీసుకి వెళ్ళగానే మునిస్వామిని పరిచయంచేసి ఆ గదినుంచి నిష్క్రమించాడు.

ఆ గదిలో పెద్దయ్యగారూ మునిస్వామీ మిగిలారు.

"ఏవయినా కబుర్లు చెప్పు," అంటూ టేబులుమీద పరచిన పొట్లాలవంక ఆకలిగా చూశాడు పెద్దయ్యగారు.

మునిస్వామి తన అనుభవాలు చెప్ప సాగాడు.


పావుగంటలో టిఫిను పొట్లాలు ఆకులుగా మిగిలిపోయాయి.

ఫ్లాస్కు — ఎండిపోయిన నుయ్యి అయిపోయింది.

ఆ తిండిచూసి - మునిస్వామి ఆశ్చర్యపోలేదు. మెచ్చుకోలుగా చూశాడు.

"గుడ్!" అంటూ తలపంకించాడు పెద్దయ్యగారు. "నీకు ఉద్యోగం యిస్తున్నాను."

మునిస్వామి ఆనందానికి మేరలేదు. ఇక తనకు కడుపు నిండినట్లే. ఏమ




యినా - తినేవాడే పెట్టగలడు. ఆకలి సంగతి అందరికీ తెలియదు.

* * *

మునిస్వామి డ్యూటీలో చేరిపోయాడు - పెద్దయ్యగారిదగ్గర. గవర్నమెంటు సర్వీసు కాకపోతేఏం, మహరాజులా బతకొచ్చు. పూలతో కూడిన దారానికి వాసనొచ్చేటట్లు అయ్యగారి జీపుడ్రయివరుగా తనకీ గౌరవమూ పలుకుబడీ దొరుకుతున్నాయి కొంత కొంత. ముఖ్యంగా తిండి శుభ్రంగా దొరుకుతూంది. తినగలిగినంత తిండి - పైసా ఖర్చులేకుండా.

నిజానికి పెద్దయ్యగారు నెలకి పది రోజులు క్యాంప్ వెళ్తే చాలుట. కాని-నెల ముప్ఫయ్ రోజులూ వారు క్యాంపులేస్తూనే ఉంటారు. కిట్టనివాళ్ల - తిండికోసం అంటారు. తను నమ్మడు. ఆయన ఆకలి అటువంటిది.అందించేవాళ్ళుండాలే కాని ఆయన కలుపుండదు. తిండి అలాగ తిన్నా ఆయన హృదయం అతి మంచిది. ఆయనని ఆకలితో ఉంచితేతప్ప ఆఫీసు కాగితాల జోలికిపోరు. ఎవరికీ అపకారం చెయ్యరు. ఆకలేస్తే ఎవరుమాత్రం మంచిగా ఉండగలరు? కడుపు మండుతూంటే ఎదుటివాడినే తినెయ్యాలని పిస్తుంది. ఆకలిబాధకు తాళలేకనేకదా వ్యాసుడంతటివాడు అన్నపూర్ణాదేవి నిలయమయిన కాశీని శపించబోయాడు.

అధికారం ఉంది. కనుక క్యాంపుల కెళ్ళి రాజభోగాలు జరిపించుకుంటాడు. అసూయపడితే ఏంలాభం? అరిగించుకో

గల శక్తి ఉంది కనుక అతిగా తింటాడు ఈసుచెంది ఏంసుఖం?

గులాబ్‌జామ్ పళ్ళాన్ని నోటిలోకి వొంచేసుకోవడం, దోసెను కిళ్ళీలా చుట్టి అమాంతం మాయంచేయడం, ఫ్లాస్కుడు కాఫీ గడగడా తాగెయ్యడం–చూసేవాళ్ళకి చిత్రంగానే ఉంటాయి. అందుకే అయ్యగారు తనని తప్ప సాధారణంగా పైవారిని ఉండ నివ్వరు టిఫినారగించేటప్పుడు.

అయ్యగారు క్యాంపు వెళ్ళకపోతే—

విశాఖపట్నంనుంచి రొయ్యలబుట్ట పాలకొల్లునుంచి బత్తాయిలు, రాజమండ్రి నుంచి కాయగూరలబస్తా - యిలాగ యింటికి వచ్చి పడవలసిందే. లేకపోతే ఆ స్టేషన్లలో అధికారులకి ఊస్టింగే.

అయ్యగారి దతిసూక్ష్మబుద్ధి—వారు ఫైలు చూశారంటే అవతలివాడి పని గోవిందేట. అందుకే ఆయన వచ్చేసరికి ఫైళ్ళందించడం మానేసి ఫలహారాలందిస్తారు. ఆయనలో సుగుణమే అది, ఆకలి ముందు ఆఫీసుపని వదిలేస్తారు.

ధర్మరాజు. తాను తింటాడు, ద్రయి వరుకి పెట్టిస్తాడు.

తను మహారాజ భోగమే అనుభవిస్తున్నాడు. నవాబు తిండే తింటున్నాడు.

అయ్యగారిలా పదిమంది పెట్టు మనిషి కాలేకపోయినా ఆయనలో సగం వరకూ వచ్చాడంటే అంతా వారు పెట్టించిన తిండిచలవే.

* * *

"ఒరే మునిస్వామీ, రేపటినుంచి మనం క్యాంపు వెళ్ళక్కర్లేదురా" అన్నారయ్యగారు.

మునిస్వామి గుండెల్లో బండపడింది. "ఏం బాబూ?"

"కంపల్సరీ రిటైర్‌మెంట్ యిచ్చేశార్రా. ఘనంగా బతికిన యీ వూళ్ళో యిక ఉండలేను. మా జిల్లాకి పోతాను. నువ్వూ ఎక్కడేనా పనిచూసుకో."

మాటాడలేక - అయ్యగారి ముఖం చూడలేక - వదిలి వచ్చేశాడు మునిస్వామి. అలా వచ్చినవాడు - ఆరు నెలలు తిరక్కుండానే ఆకలిచావు చచ్చాడు.

అయ్యగారు ఉద్యోగం పోయాక ఆస్తిని తినెయ్యడం ప్రారంభించారు. అలవాట్లు పోవుకదా?

ఆయన చనిపోయేసరికి వారసులకేమీ మిగలలేదు.

ఆస్తిని అక్షరాలా తినేశాడంటారు.

